సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 23 । జూన్ । 2025



వ్యాధుల కాలం

వర్షాకాలంలో వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంటుంది. పారిశుద్ధ్యం మెరుగ్గా లేని ప్రాంతాల్లో జ్వరం, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదముంది. 8లో



ఆర్టీసీ బస్సుకు బ్రేకులు ఫెయిల్

ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. ద్వారకాతిరుమలలో బస్సు బ్రేకులు విఫలం కాగా స్తంభాన్ని, షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని బస్సు ఢీకొట్టి నిలిచిపోయింది. 8లో



నిర్లక్ష్యానికి నిదర్శనం

ఆకివీడు సీహెచ్‌సీలో అధికారుల నిర్లక్ష్యంతో వైద్య సామగ్రి, రోగులకు అవసరమైన మంచాలు నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిని వేలం వేసేందుకు నిర్ణయించారు. 8లో

న్యూస్‌రీల్

'దారితప్పుతున్న కూటమి' బుక్‌లెట్ విడుదల



టీడీపీ కూటమి ఏడాది పాలనపై బుక్‌లెట్ విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో 143 హామీలిచ్చి కేవలం **20 హామీల** లోపే అమలు చేశారని జిల్లా **కార్యదర్శి** జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. దారితప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన బుక్‌లెట్‌ని ఆదివారం భీమవరంలో విడుదల చేశారు. ఈ ఏడాది కాలం కూటమి ప్రభుత్వం పనిని సమీక్షించి సీపీఎం పార్టీ ఈ బుక్‌లెట్‌ని ముద్రించి విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి తన ఇచ్చిన హామీలలో 20లోపే అమలు చేశారన్నారు. అత్యధిక హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిన దానికి రేటింగ్, గ్రేడింగ్ ఇవ్వాల్సి వస్తే ఈ సంవత్సర కాలంలో చాలా తక్కువ మార్కులే వచ్చాయన్నారు. 10కిగాను 1.75 మార్కులు వచ్చాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు, బి.వాసుదేవరావు, కమిటీ సభ్యులు జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు సకాలంలో చెల్లించాలి



తణుకులో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశం

తణుకు అర్బన్ : తాజాగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో జూన్ నెల వేతనాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం కోరారు. సీఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం చేసి పొజిషన్ ఐడీలను కేటాయించి ట్రెజరీ అధికారులకు తగు సూచనలు ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా సబ్ కమిటీ సమావేశం ఆదివారం స్థానిక మునిసిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు వేలాది కోట్ల రూపాయలు బకాయిలు ఉందని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది రకాల పాఠశాల విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు . జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ, జిల్లా కార్యదర్శి కే.రాంబాబు, వి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సరాసరి వర్షపాతం 22.5 మి.మీ

భీమవరం: జిల్లాలో ఆదివారం 22.5 మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా తాడేపల్లిగూడెం 55.2 మి.మీ., పెంటపాడు 39.2, తణుకు 18.6, అత్తిలి 18, గణపవరం 52.2, ఆకివీడు 12.4, ఉండి 9.4, పాలకోడేరు 21, పెనుమంట్ర 15.8, ఇరగవరం 65.2, పెనుగొండ 32.2, ఆచంట 20, పోడూరు 10.4, వీరవాసరం 13.2, భీమవరం 23.2, కాళ్ల 12.6, మొగల్తూరు 7.4, నరసాపురం 7.2, పాలకొల్లు 13చ యలమంచిలి 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

భీమవరం: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన మెగా డీఎస్సీ–2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 3 పరీక్షా కేంద్రాల్లో ఉదయం షిఫ్టుకు 310 మందికి 296 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 310 మందికి 238 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. స్పెషల్ స్క్వాడ్ టీం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

అడిషినల్ డీఎంహెచ్‌వో బదిలీ

భీమవరం(ప్రకాశం చౌక్) జిల్లా వైద్యా ఆరోగ్యశాఖలో అడిషనల్ డీఎంహెచ్‌వోగా పనిచేసిన బి.భానునాయక్ ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 5 ఏళ్ల సర్వీసు పూర్తికావడంతో బదిలీ చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

భీమవరం (ప్రకాశంచౌక్): సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కలెక్టర్ కార్యాలయం, డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందించవచ్చన్నారు.

యువత, విద్యార్థులకు వెన్నుపోటు

- ఏడాది దాటినా ఒక్క ఉద్యోగమూ ఇవ్వని వైనం
- నిరుద్యోగ భృతిపై నోరు మెదపని ప్రభుత్వం
- నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం రూ.540 కోట్ల బాకీ
- రీయింబర్స్‌మెంట్ బకాయి రూ.168.75 కోట్లు
- యువత, విద్యార్థులకు అండగా నేడు వైఎస్సార్‌సీపీ యువత పోరు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మోసం, వెన్నుపోటు ప్రధాన ఎజెండాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వరిపాలన సాగిస్తోంది. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్‌తో పాటు అనేక హామీలను గుప్పించి ప్రజలను నమ్మించి వారి మద్దతుతో అధికారంలోకి వచ్చాక.. ఏడాదిగా అదిగో ఇదిగో అని కాలం వెళ్ళదీసింది. యువత, విద్యార్థులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. సూపర్ సిక్స్ పథకాల్లోని ఇంటింటికీ ఉద్యోగం, లేకపోతే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి దాని గురించి ప్రభుత్వం ఇప్పుడు కనీసం నోరు కూడా మెదపడంలేదు.

ఒక్క ఉద్యోగమూ లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల్లోని ఇంటింటికీ ఉద్యోగం, లేని పక్షంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి పథకం అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చలేదు. వలంటీర్లను తొలగించబోమని, ప్రతి వాలంటీర్‌కూ నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ఆ హామీని అమలు చేయకుండా వలంటీర్లను మోసం చేస్తూ వారి ఉద్యోగాలను పీకేసి రాక్షసానందం పొందింది. క్లాప్ ఆటోలు, ఎండీయూ వాహనాలను నిలిపి వేసి వాటిపై ఉపాధి పొందుతున్న నిరుద్యోగుల పొట్ట కొట్టింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో

గత ప్రభుత్వం యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే సచివాలయాల్లో సుమారు 700 మందికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించగా మరో 10,500 మందికి వలంటీర్లుగా అవకాశం కల్పించింది. దీంతో పాటు పాతికేళ్ళుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న డీఎస్సీ అర్హులకూ టీచర్లుగా ఉద్యోగాలిచ్చింది. ఒక్కో స్కిల్ హబ్‌కు రూ. 11 లక్షల నిధులు మంజూరు చేసి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్‌లు ఏర్పాటు చేసింది. ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చే ట్రైనర్లకు, పారితోషికం, శిక్షణ పొందే ప్రతి అభ్యర్థికి రూ.1000 స్టైఫండ్ ఇచ్చింది. స్కిల్ హబ్‌లలో శిక్షణ పొందిన సుమారు 3 వేల మందికి వివిధ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభించేలా కృషి చేసింది.

కూటమి ప్రభుత్వం రూ.540 కోట్ల బాకీ

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ ఉద్యోగం ఇవ్వాలి. అది ఎలాగూ నెరవేర్చలేదు కాబట్టి నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సుమారు 1.50 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారికి ఇస్తానన్న నిరుద్యోగ భృతిని 12 నెలలకు లెక్క వేస్తే ఇప్పటి వరకూ ఒక్కొక్కరికీ రూ.36 వేలు చొప్పున రూ.540 కోట్లు బకాయిపడింది.

రీయింబర్స్‌మెంట్ బకాయి రూ.168.75 కోట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెనగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిమిత్తం 2019-20 సంవత్సరంలో 36,527 మంది విద్యార్థులకు రూ.95.78 కోట్లు, 2020-21 సంవత్సరంలో 37,148 మందికి రూ 77.97 కోట్లు, 2021-22లో 38,677 మంది విద్యార్థులకు రూ.105.67 కోట్లు, 2022-23లో 33,655 మందికి రూ.81.53 కోట్లు, 2023-24 సంవత్సరంలో 29,111 మంది విద్యార్థులకు రూ.22.45 కోట్లు జమ చేసింది. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిమిత్తం ఏడాదిలో ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో విద్యార్థుల ఫీజుల బకాయిలు కొండల్లా పేరుకుపోయాయి. ఈ మేరకు జిల్లాలో సుమారు 37,500 మంది విద్యార్థులకు సగటున రూ.45 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిమిత్తం కూటమి ప్రభుత్వం మొత్తం రూ.168.75 కోట్లు బకాయి పడింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక అవమానాల పాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థుల చదువు రాచమార్గంలో పయనించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ నిమిత్తం ఒక్క రూపాయి కూడా జమ చేయక పోవడంతో విద్యార్థులు అవమానాలపాలవుతున్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదని తరగతి గదుల్లో అందరి ముందూ నుంచోబెట్టి ఫీజుల గురించి నిలదీస్తుంటే విద్యార్థులు అవమానభారంతో తలెత్తుకోలేకపోతున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ యువత పోరు

కూటమి పాలనలో మోసపోయిన యువత, నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు పార్టీ నాయకులు సోమవారం యువత పోరు పేరిట ఆందోళనకు దిగుతున్నారు.

ప్రభుత్వాన్ని నిలదీయడానికే యువత పోరు



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్నీ వైఫల్యాలే. సంక్షేమ పథకాల అమలులో మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు తీరని అన్యాయం చేసింది. ఉద్యోగాలు ఇస్తానని ఇంతవరకూ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు ఊసే ఎత్తడం లేదు. దీనిపై నిలదీయడానికే యువతకు అండగా యువత పోరుబాట ఆందోళన చేపడుతున్నాం.

– కామిరెడ్డి నాని, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడు

ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి



రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థులను ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. నిరుద్యోగ భృతి వస్తుందని కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే వారిని అస్సలు పట్టించుకోవడంలేదు. ఫీజులు చెల్లించడం కోసం తల్లిదండ్రులు అప్పుల కోసం తొక్కని గడప లేదు. వారు గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి. బకాయిలను, నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలి.

– కోడె కాశి, వైఎస్సార్‌సీపీ ఉంగుటూరు నియోజకవర్గ యువజన అధ్యక్షుడు

యువత పోరుకు తరలిరండి



చిగురుపాటి సందీప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

భీమవరం: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసినందుకు నిరసనగా సోమవారం భీమవరంలో యువత పోరు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ చెప్పారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతి తక్షణమే ఇవ్వాలని, ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని కూటమి సర్కారును నిలదీస్తూ నిర్వహిస్తున్న యువత పోరు సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణ శివారు విస్సాకోడేరు వంతెన వద్ద ప్రారంభమవుతుందని సందీప్ తెలిపారు. అక్కడ నుంచి నిరసన ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని వినతిపత్రం అందచేస్తామని ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సందీప్ కోరారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్) : పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ అంశంపై రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రోజురోజుకీ ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెరుగుతోందని, దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఉందన్నారు. సహకార రంగంలో ఉన్న ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయకుండా ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ యోచన విరమించుకోవాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో వస్తున్న రికవరీ శాతం ఆధారంగానే ధర నిర్ణయం జరుగుతుందని చెప్పారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని, రైతులను సమీకరించి ఉద్యమం చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు.

పాములదిబ్బలో ఉద్రిక్తత

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలోని పాములదిబ్బలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడు శివారులో పాములదిబ్బకు చెందిన ఎర్రబాబు హత్యకు గురయ్యాడు. నిందితులు పాములదిబ్బకు చెందినవారే కావడం, ఇరు వర్గాల ఇళ్ల సమీపంలోనే ఉండటంతో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఎర్రబాబు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రత్యర్థుల ఇళ్ళను ధ్వంసం చేస్తూ ..ఇళ్ళల్లోని సామగ్రిని బయట పడేశారు. పోలీస్ అధికారులు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు వర్గాలు దాడులకు చేసుకునే అవకాశం ఉండడంతో అదనపు బలగాలను రప్పించారు. ఎర్రబాబు మృతదేహానికి ఆదివారం ఏలూరు జీజీహెచ్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హత్య కేసులో ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్నవారి కోసం పోలీస్ ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేసింది.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో
భక్తుల రద్దీ



కొల్లేటికోట దేవస్థానం వద్ద భక్తుల రద్దీ

కైకలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో కొల్లేటికోట దేవస్థానం ఆదివారం మార్మోగింది. సమీప జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, పెద్ద, చిన్న తీర్థాలు, కేశఖండన, లడ్డూ ప్రసాదం, అద్దెలు, అమ్మవారి చిత్రపటాలు, వాహన పూజలు, విరాళాల ద్వారా రూ.79,710 ఆదాయం వచ్చిందని చెప్పారు.

ముగిసిన బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన ఎంటీఎస్ టీచర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఎస్సీ 1998, 2008 ఉపాధ్యాయులకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. 2008 డీఎస్సీకి సంబంధించిన 191 మంది ఎంటీఎస్ టీచర్లు, 1998 డీఎస్సీకి సంబంధించిన 199 మంది టీచర్లు పాల్గొన్నారు. వీరికి విద్యాశాఖ అధికారులు ఉమ్మడి జిల్లాలోని 700 ఖాళీలను చూపారు. సీనియారిటీ ప్రాతిపదికన తొలుత 2008, అనంతరం 1998 ఎంటీఎస్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌ను సెంటర్‌కు దగ్గరగా ఉండే జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించకుండా సెంటర్‌కు దూరంగా ఉన్న జీఎంసీ బాలయోగి సైన్స్‌పార్కులో ఏర్పాటు చేయడంతో ఎంటీఎస్ టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే వారి కోసం కేంద్రంలో ఎలాంటి టెంట్‌లు వేయకపోవడంతో ఎక్కువ మంది తలోదిక్కున, చెట్ల నీడల్లో ఉండాల్సి రావడంపై అసంతృప్తి వ్యక్తమయింది.

నిడదవోలు గేటు మూసివేతతో బస్సుల మళ్లింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళ్లే బస్సులు నిడదవోలు రైల్వే గేటు రిపేర్ల కారణంగా మూడు నెలలు మూసివేసినందున బస్సులను మరో మార్గంలో మళ్లింపు చేసినట్లు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఏఆర్ఎల్ సుధారాణి తెలిపారు. రాజమండ్రికి వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ నెల 23న సోమవారం నుంచి తాడేపల్లిగూడెం, ప్రత్తిపాడు క్రాస్ రోడ్డు, నవాబ్‌పాలెం, మాధవరం, అప్పారావుపేట, కోరుమామిడి, తాడిమళ్ళ, తిమ్మరాజుపాలెం మీదుగా నిడదవోలు అక్కడ నుంచి రాజమండ్రి వెళతాయని చెప్పారు. పాత రూట్ నందమూరు, శెట్టిపేట మీదుగా బస్సులు వెళ్ళవని, ప్రయాణికులు గుర్తించాలన్నారు.

రోజువారీ సేవలు బంద్

- ఆందోళన బాటలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- నేటి నుంచి పూర్తి స్థాయి సమ్మెలోకి కార్మికులు
- సమ్మె ఒప్పందాల్ని అమలు చేయాలని డిమాండ్
- పశ్చిమలో 310 మంది ఇంజినీరింగ్ కార్మికులు



తణుకులో దీక్షలు చేస్తున్న మునిసిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు

తణుకు అర్బన్ : గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళనలు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఎలాంటి న్యాయం జరగలేదని నిరాహారదీక్షలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుంచి పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అన్ని మున్సిపాలిటీల అధికారులు, స్థానిక శాసన సభ్యులకు సమ్మె నోటీసులు అందచేశారు. ఈ నెల 20 నుంచి మునిసిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం, చర్చలకు పిలవకపోవడంతో పూర్తిస్థాయి సమ్మెలోకి దిగుతున్నారు. దీంతో ఇంజినీరింగ్ విభాగంలోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పార్కు మజ్దూర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ, అటెండర్స్ సేవలు నిలవనున్నాయి.

2023 డిసెంబర్ నెలలో జరిగిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతున్నారు. ఎక్స్‌గ్రేషియా ఏడు లక్షలకు పెంపు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75,000, దహన సంస్కారాల ఖర్చులు 20,000, రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం వంటి అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని తక్షణమే అమలు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్నారు.

నిలిచిపోనున్న సేవలు

వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ విభాగాల్లో కార్మికులు అందుబాటులో లేకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయా విభాగాల్లో ఏ సమస్య వచ్చినా ఫిర్యాదుచేసిన వెంటనే కార్మికులు ఆ సమస్యలను పరిష్కరిస్తున్నారు. సమ్మె కారణంగా ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


జిల్లాలో 310 మంది కార్మికులు

భీమవరంతో పాటు తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు మున్సిపల్ కార్యాలయాల్లో నగర పంచాయతీగా ఉన్న ఆకివీడులో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో 310 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి రూ.15 వేలు వేతనం కాగా కేవలం రూ.13,080లు మాత్రమే చేతికి అందుతుంది.

కార్మికుల ప్రధాన డిమాండ్లు

- టెక్నికల్ రూ.29,200, నాన్ టెక్నికల్ రూ.24,500 జీతం అమలుచేయాలి.
- షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- రిటైర్‌మెంట్, చనిపోయినా, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి
- ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలి.
- చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి.
- ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీతో పాటు కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.


ఉద్యోగ భద్రత కల్పించాలి



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో చాలా కష్టంగా ఉంది. కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. విధుల్లోకి వచ్చినప్పటి నుంచి ఒళ్లు దాచుకోకుండా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– గెల్లా విజయకుమార్, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ కార్యదర్శి

పర్మినెంట్ చేయాలి



ఆప్కాస్ విధానాన్ని ఉంచాలి. తీసేయాల్సివస్తే పర్మినెంట్ చేయాలనేది ప్రధాన డిమాండ్. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయాలి. వేతన సవరణ చేసి పెరుగుతున్న మార్కెట్ ధరలకు అనుగుణంగా మాకు కనీస వేతనాలు అందచేయాలి.

– ఉండ్రాజవరపు శ్రీను, ఏకార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తణుకు శాఖ అధ్యక్షుడు

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



ఇంజినీరింగ్ సెక్షన్‌లో 25 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది కదా అనే ఆశతో చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్నాం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న అంశాన్ని కూడా పట్టించుకోవడంలేదు. మా సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే ఉద్దేశ్యంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సివచ్చింది.

– కొపనాతి వెంకటకృష్ణ, నరసాపురం

క్లుప్తంగా

పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలలో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సిల్వర్ సెట్‌లో ప్రతిభ


చిరు హాసిని

భీమడోలు: ఉమ్మడి రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిల్వర్ సెట్ ఫలితాల్లో బీఎస్సీ లెక్కల విభాగంలో పయ్యావుల చిరు హాసిని మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటింది. ఉమ్మడి రాష్ట్రాల్లో సిల్వర్ జూబ్లీ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలకు ప్రతి ఏటా సిల్వర్ సెట్‌ను నిర్వహిస్తుంది. శనివారం ఫలితాలు విడుదల కాగా.. చిరు హాసిని ప్రతిభ చాటింది. ఇందులో సీట్ సాధిస్తే మూడేళ్ల పాటు రెసిడెన్షియల్ కళాశాలలో ప్రవేశం ఉంటుంది. చదువుతో పాటు భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

నేడు తణుకులో ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫెన్సింగ్ టీం సెలక్షన్లు ఈనెల 23వ తేదీన తణుకు విద్యా వ్యాలీ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు మినీ (అండర్ 12) విభాగంలో 2014 నుంచి 2015లోపు పుట్టిన ఫెన్సర్లు, చైల్డ్ (అండర్ 10) విభాగంలో 2016 నుంచి 2018 మధ్యలో పుట్టిన ఫెన్సర్లు హాజరుకావాల్సిందిగా కోరారు. ఎంపికైన జట్లు ఈ నెల 28, 29 తేదీల్లో కాకినాడ జిల్లా పరిషత్ కళ్యాణ మండపంలో నిర్వహించే ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ 11వ చైల్డ్, మినీ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. వివరాలకు 96802 34566 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తీసుకువెళ్తున్న దృశ్యం

పెనుమంట్ర: నవుడూరు- పాలమూరు గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలమూరు గ్రామానికి చెందిన కడలి నాగార్జున (33) మృతి చెందాడు. మోటార్ సైకిల్‌పై భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న నాగార్జునను స్థానికుల సమాచారంతో 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పైలట్ బాలకృష్ణ తెలిపారు. పెయింటర్‌గా పనిచేస్తున్న నాగార్జున ఇటీవల దుబాయ్ నుంచి వచ్చాడని, అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, అతని బంధువులు తెలిపారు.

వానా కాలం.. వ్యాధుల కాలం

- దోమల విజృంభణతో డెంగీ, మలేరియా సోకే ప్రమాదం
- పరిసరాల, వ్యక్తిగత శుభ్రతే ప్రధానమని వైద్యుల సూచన



భీమవరం(ప్రకాశం చౌక్): వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల సోకే ప్రమాదం పొంచి ఉంటుంది. డ్రెయినేజీల పారుదల సక్రమంగా లేక రోజుల తరబడి మురుగు నీరు నిలిచిపోవడం, పారిశుద్ధ్యం మెరుగ్గా లేని ప్రాంతాల్లో దోమలు, సూక్ష్మక్రిములు వృద్ధి చెంది వ్యాధులకు కారకాలుగా మారతాయి. దీంతో జ్వరం, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదముందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి జీ.గీతా భాయి సూచిస్తున్నారు. ప్రతి ఏడాది జ్వరాల వల్ల చనిపోతున్న వారి సంఖ్య పెరుగుతుందని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను ఆశ్రయించాలని అంటున్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

సాధారణ జ్వరం, జలుబు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తిచెందుతాయి. గాలి, నీటి ద్వారా మానవ శరీరంలోకి సూక్ష్మజీవులు ప్రవేశిస్తాయి. వైరస్ రకాన్ని బట్టి జ్వరం ఉంటుంది. జ్వరం మాత్రమే కాకుండా కొందరికి దగ్గు, కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం 3 నుంచి 7 రోజుల వరకు ఉంటుంది.

చికెన్ గున్యా

తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు చికెన్ గున్యా లక్షణాలు. ఈ జ్వరం దోమ కాటు వల్ల వస్తుంది. చికెన్ గున్యా సోకితే మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది.

మలేరియా

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా లక్షణం. జ్వరం తగ్గి మళ్లీ వస్తుంది. మలేరియా ఆడ అనాఫిలిస్ దోమ కాటుతో వ్యాప్తి చెందుతుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా జెరమ్స్ శరీరం లోపలికి వెళ్తాయి. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి.

డెంగీ

ఈడిస్ ఈజిప్ట అనే దోమ కాటుతో డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ పగటి పూట కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దుర్లు కనిపిస్తాయి. వైరల్ జ్వరం మాదిరి అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో ఎముకలు విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీరం లోపలి భాగాల్లో రక్తస్రావం జరుగుతుంది. దాని వల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు భాగాల చర్మంపై ఎరగ్రా కందినట్లుగా చినచిన మొటిములు కనిపిస్తాయి. ఒక్కోసారి ప్లేట్లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా ఉంటుంది.

హెపటైటిస్ ఎ

వర్షాకాలంలో హెపటైటిస్ ఎ (కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇది కాలేయకణాల్లో సంక్రమణ వల్ల కలుగుతుంది. ఈ వ్యాధి సూక్ష్మక్రిములు కలుషితమైన ఆహార పదార్థాల నుంచి, తాగునీటి నుంచి శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

టైఫాయిడ్

వర్షాకాలంలో టైఫాయిడ్ కేసులు పెరిగే అవకాశం ఉంది. ఇది సాల్మొనెల్లా టైఫి బాక్టీరియా వల్ల వస్తుంది. మురుగునీరు తాగడం, కలుషితమైన ఆహారం తినడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

దోమల నివారణకు చర్యలు శూన్యం

జిల్లాలోని పట్టణాల్లో గాని పల్లెల్లో గాని దోమల నివారణ చర్యలు అధికార యంత్రాంగం చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. పట్టణాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుందని, పల్లెల్లో కచ్చా డ్రెయిన్లు తవ్వడం, డ్రెయినేజీల పూడిక పనులు నిర్వహించడం లేదని అంటున్నారు. దోమల నివారణకు ఫాంగింగ్ చేయడం లేదని, ఎక్కడా కనీసం బ్లీచింగ్ పౌడర్ జల్లడం కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


భీమవరం మెంటేవారితోటలో డ్రెయిన్‌లో అధ్వానంగా ఉన్న చెత్తాచెదారం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- పెంటకుప్పలు, చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలి.
- ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- ఇంటిలో అన్ని గదుల్లో దోమలు రాకుండా చూసుకోవాలి. దోమ తెరలు వాడడం శ్రేయస్కరం.
- శరీరం మొత్తం కప్పేలా ఉన్న దుస్తులు ధరించాలి.
- వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలి.
- నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి.
- వర్షంలో తడవరాదు. తడిచిన బట్టలలో ఎక్కువ సేపు ఉండకూడదు.
- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- బయట ఆహారం తినకూడదు.
- నిల్వ పదార్థాలు తినరాదు. వేడి ఆహార పదార్థాలు తినడం మంచిది.
- తాజా పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు కలుషిత ఆహారం, కలుషిత నీరు తాగకుండా ఉండడం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షణ పొందవచ్చు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను ఆశ్రయించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– జీ.గీతాభాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ముదినేపల్లి రూరల్ : చెరువు యజమాని మందలించాడనే మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వైవాకలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన చేబోయిన శ్రీనివాసరావు (55) స్థానికంగా చేపల చెరువుపై కాపలా ఉంటూ మేతలు చల్లేవాడు. ఈ నేపథ్యంలో మేతల బస్తాలు దొంగతనానికి గురవుతున్నాయని, ఇందుకు శ్రీనివాసరావు కారకుడని యజమాని మందలించడంతో పాటు గ్రామంలోని పెద్దలకు విషయాన్ని తెలియజేస్తానని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. భార్య, కుమారుడు గమనించి వెంటనే గుడివాడ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడి కుమారుడు సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తమ్మిలేరులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


తమ్మిలేరు జలాశయం నుంచి యువకుడి మృతదేహం బయటకు తీస్తున్న దృశ్యం

చింతలపూడి: చేపల వేటకు వెళ్లి గల్లంతైన చింతలపూడి నగర పంచాయతీ ఛార్లెస్ నగర్‌కు చెందిన యువకుడి మృతదేహాన్ని ఆదివారం వెలికితీశారు. నాగిరెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరులో చేపల వేట కోసం శనివారం స్నేహితులతో కలిసి వెళ్లిన గడ్డం శాంతకుమార్(29) ప్రమాదవశాత్తూ గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం రాత్రి వర్షం కురవడంతో గాలింపు చర్యలు నిలుపుదల చేసిన అధికారులు ఆదివారం ఉదయం కొనసాగించి మృతదేహాన్ని కనుగొన్నారు. ఎస్సై కె సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పంచనామ అనంతరం పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ కుమార్ చెప్పారు. శాంతకుమార్ మృతితో ఛార్లెస్ నగర్‌లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

ద్వారకాతిరుమలలో ఆర్టీసీ బస్సుకు బ్రేక్‌లు విఫలం

- స్ట్రీట్ లైట్ స్తంభాన్ని, షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ఢీకొట్టిన బస్సు
- వృద్ధురాలికి తీవ్ర, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం


ద్వారకాతిరుమలలో స్ట్రీట్ లైట్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ద్వారకాతిరుమల: ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు బ్రేకులు విఫలం కావడంతో రోడ్డు పక్కనున్న స్ట్రీట్ లైట్ స్తంభాన్ని, ఆ తరువాత షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. ద్వారకాతిరుమల క్షేత్రంలో డీసీసీ బ్రాంచి ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో ఒక వృద్ధురాలు తీవ్ర గాయాలుపాలు కాగా, డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం. తణుకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు క్షేత్రంలోని గుడి సెంటర్ నుంచి సుమారు 70 మంది యాత్రికులతో తణుకుకు బయల్దేరింది. ప్రారంభంలోనే బస్సు బ్రేక్‌లు విఫలమయ్యాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి బస్సును పక్కకు తిప్పాడు. దాంతో బస్సు దేవస్థానం స్ట్రీట్ లైట్ స్తంభాన్ని, ఆ తరువాత షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. బస్సులో ఉన్న యాత్రికులు ఒక్కసారిగా భయాందోళనతో కేకలు పెట్టారు. ఈ ప్రమాదంలో అత్తిలి గ్రామానికి చెందిన వృద్ధురాలు ప్రభావతి తీవ్రంగా, డ్రైవర్ శ్రీనివాస్ స్వల్పంగా గాయపడ్డారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ ఎలివేషన్ కొంత భాగం, బస్సు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ప్రభావతికి స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ప్రవీణ్‌కుమార్ ప్రథమ చికిత్స చేశారు. కాగా స్థానికులు, భక్తులతో రద్దీగా, పల్లంగా ఉన్న ఆ ప్రాంతంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. యాత్రికులంతా వేరువేరు బస్సుల్లో స్వగ్రామాలకు తరలివెళ్లారు.


ఘటనా స్థలంలో రోదిస్తున్న వృద్ధురాలు ప్రభావతి


మరో బస్సు ఎక్కేందుకు వెళుతున్న యాత్రికులు

● నిర్లక్ష్యానికి నిదర్శనం


సీహెచ్‌సీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మంచాలు

అధికారుల నిర్లక్ష్యంతో వైద్య సామాగ్రి, రోగులకు అవసరమైన మంచాలు నిరుపయోగంగా మారాయి. ఆకివీడు సీహెచ్‌సీకి గత ప్రభుత్వం రోగుల కోసం మంచాలు సరఫరా చేసింది. అయితే అధికారులు వాటిలో కొన్ని వినియోగించగా మిగిలిన వాటిని ఆసుపత్రి ఆవరణలోనే నిర్లక్ష్యంగానే వదిలేశారు. దీంతో మంచాలు ఎండకు ఎండి, వర్షానికి తడిచి నిరుపయోగంగా మారాయి. అలాగే గతంలో సీహెచ్‌సీకి మూడు ఫొటో థెరపీ యూనిట్లు దాతలు సమకూర్చగా వాటిలో ఒకటి పనికి రాకుండా పోవడంతో దానిని కూడా ఆసుపత్రి ఆవరణలోనే వదిలేశారు. దీంతో జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రం అధికారి సూచనల మేరకు వాటిని వేలం వేసేందుకు నిర్ణయించారు. పాత పరికరాలు, యూనిట్లు పాడైపోతే తీసివేయడం సహజమే. వాటిని సకాలంలో వినియోగించుకున్నప్పుడే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పలువురు భావిస్తున్నారు. – ఆకివీడు


ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఫొటోథెరపీ యూనిట్

ఇదే రీతిలో మీ పిల్లలను తరలిస్తారా?

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం తన గొప్పల కోసం, ప్రధాని మోడీ మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని ఏఐఎస్‌ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అనేక మంది గిరిజన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టళ్ల నుంచి యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి రెండు గంటలకు బస్సుల్లో తరలించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో విద్యార్థులకు నిద్రించడానికి సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని, ఇదే రీతిలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, అధికారుల పిల్లలను తరలిస్తారా అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థులు అనారోగ్యానికి గురైతే హాస్పిటళ్లకు తరలించడానికి హెల్త్ వర్కర్లు, అంబులెన్స్‌లు ఉండవు కానీ, యోగాంధ్రకు మాత్రం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి తరలించారని విమర్శించారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే ఏఐఎస్‌ఎఫ్ తరుపున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


పెద్దిశెట్టి నాగేశ్వరమ్మ

దెందులూరు: గాలాయగూడెంలో శతాధిక వృద్ధురాలు అచ్చం పేరంటాలు తల్లి ఆలయ కమిటీ సభ్యురాలు పెద్దిశెట్టి నాని పెద్దమ్మ అలియాస్ పెద్దిశెట్టి నాగేశ్వరమ్మ (104) ఆదివారం మృతి చెందారు. ఆమెకు 10 మంది సంతానం. మునిమనుమలతో సహా నాలుగు తరాల కుటుంబ సభ్యులను చూసిన ఆమె మృతిపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నివాళులర్పించారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి కృషి


మహాసభలో మాట్లాడుతున్న నరసింహారావు

ఏలూరు (టూటౌన్): భారత జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ)లో పనిచేస్తున్న ఏజెంట్ల సంక్షేమానికి కృషి చేయడంలో ఎల్‌ఐసీ ఏఓఐ సంఘం ఎప్పుడూ ముందుంటుందని ఆ సంఘ సౌత్ సెంట్రల్ జోనల్ (ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు) ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు అన్నారు. ఆ సంఘ మహాసభ ఆదివారం ఏలూరులో పవర్ పేట ఉద్దరాజు రామం భవనంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారావు మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏజెంట్ల కమీషన్లు తగ్గించటపై సంఘం ఉద్ధృతంగా పోరాడుతోందన్నారు. అనేక పోరాటాల ఫలితంగానే కొన్ని హక్కులను సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆహ్వాన సంఘం అధ్యక్షుడు తాళం సురేష్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కోడే రాంబాబు, మెంబర్ వైఎస్ కనకారావు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, భీమడోలు బ్రాంచ్ మేనేజర్ ఎస్.భువన దీప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఎల్‌ఐసీ ఏఓఐ రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ జి రవి కిషోర్ పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన బైక్..

ద్వారకాతిరుమల: ఆగి ఉన్న కారును బైక్ ఢీకొట్టిన ఘటనలో బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన స్థానిక ద్వారకా రెసిడెన్సీ సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. దొరసానిపాడు గ్రామానికి చెందిన కూచింపూడి వంశీ గరుడాళ్వార్ సెంటర్‌లోని పెట్రోల్ బంకు నుంచి గుడి సెంటర్ వైపునకు బైక్‌పై వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న కారును ఢీకొట్టి గాయాలపాలవగా స్థానికులు హుటాహుటీన పీహెచ్‌సీకి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి వ్యక్తి మృతి


శ్రీహరి మృతదేహం

ముదినేపల్లి రూరల్: ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పెయ్యేరు సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండవల్లి మండలం కానుకొల్లుకు చెందిన ఆకేటి శ్రీహరి(38) బైక్‌పై శనివారం రాత్రి కానుకొల్లు నుంచి ముదినేపల్లి వస్తున్నాడు. పెయ్యేరు సమీపానికి రాగానే రహదారి పక్కన నిలిపివున్న లారీ వెనుక భాగాన్ని చీకట్లో గమనించకుండా బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

'గూడెం'లో 55.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



నీలాద్రిపురం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగిన వరి నాట్లు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడచిన 24 గంటల్లో 55.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ ఆదివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 39.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. శనివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి మండలంలోని చినతాడేపల్లి, కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం, ఎల్.అగ్రహారం, మోదుగ గుంట తదితర గ్రామాల్లో నాట్లు నీట మునిగాయి. నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అయితే, ఆదివారం వాతావరణం అనుకూలించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటింటికీ ఉచిత వైద్యం



తణుకులో ఉచిత వైద్యసేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్య వృద్ధులకు వైద్యసేవలు అందించారు. తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా పర్యటించి 6గురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు పరిమి సూర్యనారాయణ ఆర్థికసాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం



వాసవి క్లబ్‌చే సేవా కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డాన్ 2 డస్క్ ప్రోగ్రాం జరిగింది. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గోకవరపు సుభాష్ హాజరయ్యారు. పలివెల ఏకాంబరం రీజనల్ చైర్‌పర్సన్ ఆలపాటి అచ్యుత లక్ష్మి, రీజనల్ సెక్రటరీ చీమకుర్తి రాజశేఖర్ గుప్తాలు పర్యవేక్షించారు. మాగంటి స్కూల్‌లో 200 మంది పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంచారు. రైతులను, సైనికులను, గురువులను సత్కరించారు. సన్నిధి సూర్యనారాయణ, రమేష్, పసుమర్తి అనిల్, బ్రహ్మాజీ, శ్రీధర్ గుప్తా, కె.లక్ష్మయ్య, సమయమంతుల వైకుంఠం, కొల్లా సురేష్, పులవర్తి మల్లికార్జున్, డైరక్టర్లు, వాసవి సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం సర్వసభ్య సమావేశం



పెంటపాడులో సీపీఎం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆదివారం దూలం ప్రసాద్ అధ్యక్షతన సీపీఎం పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు చింతకాయల బాబూరావు ఆధ్వర్యంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు, వడ్డది సన్యాసిరావు, అనురాధ, శ్యామల, ఎండ పెద్దిరాజు, జయంతి, స్వర్ణలత, చిర్ల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

తాడేపల్లిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు నిల్



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో 4 నెలల వేతనాలు ఇప్పించాలంటూ నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు, యూనియన్ నాయకులు భీమారావు. (ఫైల్)



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్ సూర్యనారాయణకు వినతి అందిస్తున్న కార్మికులు, నాయకులు భీమారావు. (ఫైల్)

- నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలందలేదు
- కార్మికులు చేసిన పనికి జీతాలివ్వలేకపోతున్న సర్కారు
- అప్పులు చేసి రోజులు గడుపుతున్న వైనం
- నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోని దుస్థితి
- డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం లేదని ఆందోళన

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలులేక అల్లాడుతున్నారు. అసలే అంతంతమాత్రం వేతనమని అది కూడా 4 నెలలుగా పెండింగ్ పెట్టారంటూ గగ్గోలు పెడుతున్నారు. వేతనాలు అందకపోవడంతో అప్పుచేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి 4 నెలలపాటు వేతన బకాయిలు ఉండిపోతున్నాయని నిరసనలు చేపట్టిన సందర్భాల్లో ఒక్కో నెల విడుదల చేస్తున్నారంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చినెలలో ఐదు నెలల బకాయిలతో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగగా హుటాహుటిన ఆస్పత్రికి వచ్చిన డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ పదిరోజుల్లో వేతన బకాయిలు ఇప్పిస్తానని హామీ ఇచ్చి సమ్మె నుంచి విరమింపచేశారని కానీ వేతన బకాయిలు మాత్రం ఇటు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై కార్మిక సంఘాల నాయకులు, ప్రజానీకం సైతం విమర్శలు గుప్పిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలివ్వలేకపోవడం సిగ్గుచేటు



పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పనులను హర్షించకపోగా వేతన బకాయిలు ఉంచడం చాలా దుర్మార్గం. ప్రభుత్వం కోట్లాది రూపాయిలు వివిధ కార్యక్రమాలకు ఖర్చుచేస్తూ పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు పెట్టడం సిగ్గుచేటు. వైద్యశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోక, ప్రభుత్వం పట్టించుకోకపోతే వారు ఎలా బతుకుతారు. ఇప్పటికే నాలుగు నెలలుగా ఇళ్ల పోషించుకోవడానికి అప్పులు చేసి వడ్డీలు కడుతూ కాలం గడుపుతున్నారు. కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ వేతనం కూడా ఏనెలది ఆనెలలో ఇవ్వకుండా ఇప్పటికి 4 నెలలు పెండింగ్ ఉంచడం చాలా దారుణం. విధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు తణుకు ఆస్పత్రికి ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టాయి. అటువంటి కార్మికులను నిర్లక్ష్యం చేయడం చాలా దారుణం.

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

క్లిష్టమైన పారిశుధ్యం పనులు

పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఆవరణతో పాటు వార్డులు, మరుగుదొడ్లు, ఆపరేషన్ థియేటర్ వంటి విభాగాల్లో నిత్యం తుడవడమే కాకుండా తడి బట్టతో శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఆస్పత్రి సామర్థ్యం పెరిగినా అదే సిబ్బందితో నెట్టుకొస్తున్న పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. పనిపెరిగినా కష్టపడి పనిచేస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్మికులు సేవలందిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్‌లో వచ్చే వ్యర్థాలతో పాటు వివిధ వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. రక్తపు వ్యర్థాల తొలగింపులో రోగాలబారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లోనే విధుల్లో ఉండాల్సి వస్తుందని అయినప్పటికీ ఏ నెల వేతనం ఆనెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో కార్మికులపై నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆస్పత్రిలో విధుల్లో ఉండే పారిశుద్ధ్య వేతనాలు సక్రమంగా రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అంటూ ఆ దిశగా పాటుపడే పారిశుద్ధ్య కార్మికులకు మొండి చేయిచూపిస్తున్నారంటూ ప్రజానీకం సైతం దుమ్మెత్తిపోస్తున్నారు. చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోతే కార్మికుల ఇళ్లు ఎలా గడుస్తాయంటూ నిలదీస్తున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 19 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచగా ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేతన గండం నెలకొందని వాపోతున్నారు. అంతేకాకుండా కార్మికులకు సంబంధించిన పీఎఫ్ కూడా తమ బ్యాంకు ఖాతాలకు జమకావడంలేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోండి



అంబులెన్స్‌లో మృతదేహం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు అన్ని జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని కైండ్‌నెస్ సొసైటీ ఫౌండేషన్ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు కోరారు. కోనసీమ జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన నాగరాజు సౌదీ అరేబియాకు జీవనోపాధి కోసం వెళ్లగా అక్కడ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు గట్టిం మాణిక్యాలరావును సంప్రదించి భౌతికకాయాన్ని ఇండియాకు రప్పించాలని కోరగా ఆయన చేసిన ప్రయత్నాలతో సౌదీ అరేబియా నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో హైదరబాద్‌కు మృతదేహాన్ని రప్పించారు. కోనసీమ జిల్లా పొదలాడ వరకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహాన్ని గ్రామానికి పంపారు. కుటుంబ సభ్యులు మాణిక్యాలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు సమ్మె నోటీసు



తణుకులో ఎమ్మెల్యే రాధాకృష్ణకు సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు

తణుకు అర్బన్: తణుకు మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు సోమవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్లుగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు సమ్మె నోటీసును అందజేసినట్లు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే తాము సమ్మెకు దిగుతున్నామని ఎమ్మెల్యేకి వివరించినట్లు కార్మిక సంఘ నాయకులు ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయ్ కుమార్, పడాల దానం, దాసరి సత్యనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రితో తమ సమస్యలు విన్నవించి తమకు న్యాయం చేయాల్సిందిగా ఎమ్మెల్యేను కోరినట్లు వివరించారు.

ఏడాదిన్నర తర్వాత మళ్లీ శంకుస్థాపనా?



కొమ్ముగూడెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం బ్రిడ్జి రూ.8.88కోట్లు, నవాబుపాలెం– వెంకట్రావుపాలెం, వెంకట్రావుపాలెం – త్యాజంపూడి రహదారికి రూ.14.95కోట్లతో గతంలోనే శంకుస్థాపన చేశారని వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ గుర్తు చేశారు. ఆదివారం మండలంలోని కొమ్ముగూడెంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ శంకుస్థాపన జరిగిన వాటికి మళ్లీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి 2023 నవంబరు 15వ తేదిన పరిపాలన అనుమతి లభించిందని, 2024 మార్చి 6వ తేదిన శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని త్యాజంపూడికి అనుసంధానంగా ఈ బ్రిడ్జి ఉండటంతో అప్పటి ఎంపీ మార్గాని భరత్ సహకారంతో ఈ బ్రిడ్జిని మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. అయితే, కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామని ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. ఈ బ్రిడ్జి నాటిదేనా...? కొత్తగా ఏమైనా మంజూరు చేయించారా ?అని ప్రశ్నించారు. వీరంపాలెం వద్ద బ్రిడ్జి కూలిపోవడానికి నాటి టీడీపీ ప్రభుత్వం కారణమని ఆరోపించారు. కాలువ వ్యాసార్థం పెంచినా బ్రిడ్జి పెంచకపోవడంతో బ్రిడ్జి కూలిపోయిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఏ గ్రామం వచ్చినా ప్రజలు వారి సమస్యలు చెప్పుకోవడం పరిపాటి అని, మీరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అంతే గౌరవంగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా సమన్వయకర్త ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ వీరంపాలెం, బంగారుగూడెం పర్యటనకు వచ్చిన సందర్భంగా అభివృద్ధి ఏమీ చేయలేదని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణపై అవాస్తవాలు మాట్లాడటం సరికాదన్నారు. రైతులను పక్కదోవ పట్టించేలా అవాస్తవాలు మాట్లాడటం దుర్మార్గమన్నారు. నీ రాజకీయ ప్రస్థానం ఏంటని ఎమ్మెల్యే నుద్దేశించి వ్యాఖ్యానించారు. చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇస్తామన్నారని, ఇప్పటి వరకు ఒక్క సెంటు స్థలం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. 2004 నుంచి 2009వ సంవత్సరం వరకు కొట్టు సత్యనారాయణ నియోజకవర్గాన్ని రూ.600 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. మీరు చేస్తే అభివృద్ధి... వేరొకరు చేస్తే విధ్వంసకాండ అని దుయ్యబట్టారు. పంట నష్టపోయిన రైతాంగానికి నేటికీ కూటమి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని విమర్శించారు. కేఎస్ఎన్ హయాంలో నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ నియంత్రణలో ఉందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారంటూ పవన్, మీరు జబ్బలు చరుచుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పేకాట క్లబ్బులు, మద్యం షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయన్నారు. స్థలాలు ఆక్రమించుకుంటే ఎమ్మెల్యే తనయుడు అధికారులను మభ్యపెట్టడం నిజం కాదా ? అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 కట్టా రంగబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు పోలిమోను శ్రీనివాస్, గంటి చిన సర్వేశ్వరరావు, తమ్మిశెట్టి రఘు, బుర్ల వెంకటేశ్వరరావు, బొట్టా రామచంద్రరావు పాల్గొన్నారు.

పెదకృష్ణంరాజు సేవలు అభినందనీయం



పెదకృష్ణంరాజును సన్మానిస్తున్న వక్తలు

పెంటపాడు: వెంకటరమణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌గా, సామాజికవేత్తగా కొలనువాడ పెదకృష్ణంరాజు సేవలు అభినీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక రాచర్ల ధర్మా ఫంక్షన్ ప్లాజాలో డాక్టరేట్ వచ్చిన సందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. ముందుగా ప్రతిపాడు, అలంపురం ఆంజనేయస్వామి విగ్రహం నుంచి సాక్షి కార్యాలయం మీదుగా రాచర్ల ధర్మఫంక్షన్ ప్లాజా వరకు ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు, జీఎస్ఎల్ ఆస్పత్రి చైర్మన్ గన్ని భాస్కరరావులు మాట్లాడుతూ వెంకట చారిటబుల్ ట్రస్టు స్థాపించి పేదల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఇప్పటి వరకు 50వేల మందికి పైగా చికిత్సలు అందించిన మహోన్నత వ్యక్తి పెదకృష్ణంరాజు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేర్ల గోవింద్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, వలవలబాబ్జీ, రాజేష్, నిడదవోలు లయన్స్ కార్యదర్శి సురేందరకుమార్, పలు ఆస్పత్రుల ప్రతినిధులు, రైస్ మిల్లలర్లు, స్కూల్ అధినేతలు ఆయనను ఘనంగా సన్మానించారు.

యువత పోరు విజయవంతం చేయాలి



పెద అమీరం పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాళ్ల: కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేశారని, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 23న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ యువజన విభాగం నాయకులు తెలిపారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రతి నెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ గొప్పగా ప్రచారం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా యువతకు ఇచ్చిన ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించి యువతకు ఇచ్చిన హామీల అమలుకు తాము నిరసన బాటపట్టనున్నట్లు చెప్పారు. ఉండి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు డొక్కు సుబ్రమణ్యం, పార్టీ నాయకులు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, నంద్యాల సీతారామయ్య, గణేశ్న రాంబాబు, కొండేటి శివకుమార్, వేగేశ్న జయరామకృష్ణంరాజు, మంతెన సునీల్ వర్మ, అంబటి రమేష్, నరేంద్ర వర్మ, గుండు నాగేశ్వరరావు, పెనుమత్స రంగరాజు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

ఉండి: ఉండి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, కార్యకర్తలు సోమవారం పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరులో పాల్గొనాలని పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. అందరూ ఉదయం 9 గంటలకు కాళ్ళ మండలం పెదఅమిరం గ్రామంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి తరలిరావాలని తెలిపారు.అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మెమొరాండం ఇచ్చేందుకు తరలిరావాలన్నారు.

నడకతో ఆరోగ్యం



వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

భీమవరం: ప్రతిరోజూ నడవడం వల్ల శరీరానికి, మనస్సుకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం ప్రభావతి అన్నారు. భీమవరం డిఎన్నార్ లైబ్రరీ సెమినార్ హాల్లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -201, 3వ క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, గవర్నర్ (డిస్ట్రిక్ట్ -201) గుంటూరి రామరాజు, పాస్ట్ గవర్నర్స్, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి మాట్లాడుతూ నడకతో ఆరోగ్యం పొందవచ్చనే ఆలోచన సంకల్పంతో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏర్పాటు అయ్యిందని, లక్షలాది మంది సభ్యులు వాకర్స్ ఇంటర్నేషనల్‌లో ఉన్నారని, జిల్లాల వారీగా గవర్నర్, సభ్యులను ఎన్నుకొని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని అన్నారు. గవర్నర్ (డిస్ట్రిక్ట్ -201) గుంటూరి రామరాజు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వాకర్స్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించి మన జిల్లా ప్రథమ స్థానంలోకి రావడానికి కృషి చేస్తామని అన్నారు. ఈనెల 29వ తేదీన తిరుపతిలో వాకర్స్ ఇంటర్నేషనల్ 163వ కౌన్సిల్ సమావేశం జరుగుతోందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని రామరాజు అన్నారు. వాకర్స్ క్లబ్‌ల ఉన్నతికి అందరూ సహకరించాలని అన్నారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో వి మురళి మోహన్ రావు, వై సత్యనారాయణ, శనగల కృష్ణమూర్తి, ఎస్ సుబ్బారావు, ఎస్ నాగేశ్వరరావు, వడుపు గోపి, బోండా శ్రీరామ్, పాత గవర్నర్ లు నరసింహమూర్తి, ఇర్రింకిసూర్యారావు, ఆర్. రామకృష్ణ రాజు కటికల పల్లారావు, పి.సీతారామరాజు, గాదిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

భీమవరం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని భీమవరం వన్ టౌన్ సీఐ నాగరాజు అన్నారు. పోలీస్ ఈగల్ ఆధ్వర్యంలో భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ అవగహన ర్యాలీ నిర్వహించారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లు కదలికలపై జాగ్రత్తగా వ్యవహరించాలని, చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వల్ల యువత శారీరకంగానూ, మానసికంగానూ తీవ్రంగా బలహీన పడిపోతారని, భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసినా, అమ్మినా, సేవించినా చట్టపరమైన శిక్షలకు గురవుతారన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



తుందుర్రు గ్రామంలో వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు) అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రులో హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం మిత్ర మెడికల్ హాస్పటల్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు చుండూరి సాయిబాబు, డాక్టర్ విక్రాంత్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మురళీ, డాక్టర్ సుమ,డాక్టర్ ప్రశాంత్ నాయుడు, డాక్టర్ మురళీ ఆరేటిలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేశారు. డాక్టర్ ఆరేటి మురళీ మాట్లాడుతూ తన స్వగ్రామం తుందుర్రు అని, గ్రామ ప్రజలకు తన వంతు సాయంగా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం డాక్టర్లను గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడేరు సొసైటీ మాజీ చైర్మన్ ఆరేటి అబ్బులు, కొట్టు సురేష్, కొట్టు త్రినాథ్, ఎంపీటీసీ ఆరేటి వాసు, జక్కంపూడి బాబ్జి, ఆరేటి చంద్రరావు, చీడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేలంలో కూటమి నాయకుల కుమ్మక్కు



ఏనుగువానిలంక మంచినీటి చెరువు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



మంచినీటి చెరువులో తేలుతున్న చేపలు

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామంలోని మంచినీటి చెరువులు ఒకరోజు చేపల వేలంలో కూటమి నాయకులు కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సుమారు నాలుగు వేల జనాభా ఉన్నారు. వీరికి మంచినీటి అవసరాలు తీర్చడానికి రెండు చెరువులు ఉన్నాయి. ఒకటి ప్రధాన గ్రామంలో గ్రామ దేవతల ఆలయంవద్ద, మరొకటి పోలవరంలో ఉన్నాయి. వేసవి వెళ్లి చెరువులో కొత్తగా నీరు పెడు తున్న నేపథ్యంలో ఈ రెండు చెరువుల్లో చేపలు పట్టడానికి పంచాయతీలో ఒకరోజు వేలం నిర్వహించారు. ఈ వేలంలో కూటమి పార్టీలకు చెందిన ప్రధాన నాయకులంతా ఏకమై పాట ఎక్కువ మొత్తంలో వెళ్లకుండా కుమ్మక్కై రెండు చెరువులను కేవలం రూ.30వేలకు దక్కించుకున్నారని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు చెరువుల్లో ప్రధాన చెరువులో ఆదివారం చేపలు పట్టారు. ఈ చెరువు సుమారు ఆరు ఎకరాలు ఉంటుంది. ఈ చెరువుగట్టున గ్రామ దేవతలు మారెమ్మ, మావూరమ్మ ఆలయాలు ఉంటాయి. దీంతో గ్రామస్తులంతా అమ్మవార్ల ప్రసాదంగా ఈ చెరువులో చేపలు కొనడానికి ఆసక్తి చూపుతారు. అయితే కుమ్మక్కై పాట దక్కించుకున్న కూటమి నాయకులు ఈ చెరువులో చేపలు పెద్ద మొత్తంలో వారే వాటాలు వేసుకుని తీసేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిగిలిన చేపలు కూడా బహిరంగ మార్కెట్‌లో కిలో చేప రూ.150 ఉండగా, అమ్మ వారి సెంటుమెంటు పేరుతో రూ.200 పైబడి అమ్మారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అవి కూడా వారి అనుయాయులకే అమ్మారని, మిగిలినవి మార్కెట్‌కు తరలించారని ఆరోపిస్తున్నారు. ఈ ఒక్క చెరువులోనే సుమారు రూ.1.50 లక్షలు వరకు వచ్చి ఉంటుందని గ్రామస్తులు చెప్పారు. పంచాయతీ ఆదాయానికి గండికొట్టి సొమ్ము చేసు కున్న కూటమి నాయకులు మరొకవైపు గ్రామస్తు లకు చేపలు అమ్మకుండా మోసం చేశారని వాపోతున్నారు. పోలవరం చెరువులో కూడా భారీ చేపలు ఉన్నాయని, ఈ వేలం మళ్లీ పెట్టి సొమ్ము కూటమి నాయకుల పరం కాకుండా పంచాయతీకి ఆదాయం తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆదివారం పట్టిన మంచినీటి చెరువులో చనిపోయిన చేపలను బయట వేయకుండా చెరువులోనే ఉంచేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ చెరువుకు నీరు పెడుతున్నారు. చనిపోయిన చేపలు చెరువులో ఉంచి కొత్త నీరు పెడితే అవి కుళ్లిపోయి నీటిలో కలవడం వల్ల ప్రజలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వెంటనే స్పందించి చనిపోయిన చేపలను బయటకు తీయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.